నమస్తే తెలంగాణ
కామారెడ్డి
12 నిజామాబాద్, శనివారం 16 నవంబర్ 2024 KAMAREDDY

# నింబాచలంలో జన జాతర

- వైభవోపేతంగా రథోత్సవం

నింబాచల క్షేత్రం భక్తజన సంద్రమైంది. నృసింహుడి నామస్మరణతో మార్మోగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవానికి జనం పోటెత్తారు. భక్తుల జయజయ ధ్వానాల నడుమ స్వామి వారు అందంగా అలంకరించిన రథంపై ఊరేగారు. అంతకు ముందు ఆలయ ధర్మకర్తలు శాస్త్రోక్తంగా పూజాది కైంకర్యాలు నిర్వహించారు. బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్, రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి తదితరులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నృసింహుడి దర్శనం కోసం వేలాది భక్తులు తరలిరాగా, ట్రాఫిక్‌ను నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారు.

– భీమ్‌గల్, నవంబర్ 15



భక్తుల జయజయ ధ్వానాల నడుమ రథంపై ఊరేగుతున్న లక్ష్మీనర్సింహుడు

# 'కార్తీక' దీపోత్సవం



నగరంలోని నీలకంఠేశ్వర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీకపౌర్ణమి సందర్భంగా శైవాలయాలు శుక్రవారం కిటకిటలాడాయి. కార్తీక దీపాల వెలుగుల్లో ఆలయాలు మిరుమిట్లుగొలిపాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. దీపాలు వెలిగించి భక్తితో వచ్చి స్వామి వారిని కొలిచారు. సుహాసినులు ఇండ్లల్లో తులసీ పూజలు నిర్వహించారు. నగరంలోని కంఠేశ్వరాలయం, బోధన్‌లోని ఏకచక్రేశ్వరాలయం సహా ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ ఆలయాలన్నీ ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తులతో సందడిగా మారాయి.

# స్వామిని దర్శించుకోకుండా కుట్ర

- లింబాద్రి గుట్టపై పోలీసుల వైఫల్యం
- గతంలో ఎప్పుడూ ట్రాఫిక్‌జామ్ కాలే
- ఈసారి ఎందుకు జామ్ అయ్యింది?
- పోలీసులపై మాజీ మంత్రి వేముల ధ్వజం
- ఎవరి మెప్పుకోసం పని చేస్తున్నారని ఆగ్రహం




ట్రాఫిక్ జామ్ కావడంతో నడుచుకుంటూ వస్తున్న ఎమ్మెల్యే వేముల

భీమ్‌గల్, నవంబర్ 15: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన లింబాద్రిగుట్ట జాతర సందర్భంగా పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ ట్రాఫిక్ జామ్ కాలేదని, ఈసారి మాత్రం ట్రాఫిక్‌ను నియంత్రించడంలో విఫలమయ్యారన్నారు. లక్షలాది భక్తుల ఇంటి దైవమైన లింబాద్రి గుట్టపై కొలువైన లక్ష్మీనర్సింహస్వామిని తాను దర్శించుకోకుండా కుట్ర పన్నారన్నారు. ఎవరి పైశాచిక ఆనందం కోసం పోలీసులు పని చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం నింబాచల క్షేత్రంలో జరిగిన లక్ష్మీనర్సింహ స్వామి రథోత్సవంలో పాల్గొన్న వేముల స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి ఆయనను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. బాల్కొండ నియజకవర్గ ప్రజలపై స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆ భగవంతుడ్ని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తుడిగా, ఎమ్మెల్యేగా గత పదేండ్లుగా లింబాద్రి గుట్ట జాతరకు వస్తున్నానని, ఏటా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి గుట్టపై ట్రాఫిక్ జామ్ కాకుండా చూసే వారన్నారు. గతంలో ఎన్నడూ లేనట్లు ఈసారి మాత్రం కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్ అయిందన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు వైఫల్యం చెందారని మండిపడ్డారు. తానే రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లానంటే, సామాన్య భక్తుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. కోట్లాది రూపాయలు తెచ్చి లింబాద్రిగుట్టను అభివృద్ధి చేసిన తనకే స్వామి వారి దర్శనం కాకుండా చేశారని ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే అయిన తాను దర్శనానికి వస్తుంటే ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాల్సిన పోలీసులు.. కుట్రపూరితంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఒకప్పుడు సింగిల్ రోడ్‌గా ఉన్న భీమ్‌గల్–లింబాద్రి గుట్ట రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చానని, అలాగే గుట్టకు వెళ్లే దారిని నాలుగు లైన్లుగా మార్చామని చెప్పారు. అలాంటి రోడ్డుపై ట్రాఫిక్ జామ్ కావడం హాస్యాస్పదమన్నారు. ఎవరి మెప్పు పొందడానికి పోలీసులు పని చేస్తున్నారని ప్రశ్నించారు. బాధ్యులైన పోలీసులపై విచారణ చేపట్టాలని ఏసీపీని కోరారు. దీనిపై సీపీ, కలెక్టర్, డీజీపీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

# ఓటరు నమోదు అంతంతే..

- లక్షల్లో పట్టభద్రులు.. అప్లయ్ చేసింది వేలల్లోనే..
- తగిన ప్రచారం లేక దరఖాస్తులు కరువు
- నిబంధనల కారణంగా చాలా మంది దూరం
- దరఖాస్తుదారులకు బీఎల్‌వోల ఫోన్లు
- ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్‌లు కావాలంటూ సతాయింపు
- నిబంధనలతో విసుగుచెందిన పట్టభద్రులు




నిజామాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నిజామాబాద్–కరీంనగర్–ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో ఓటరు నమోదుకు పెద్దగా స్పందన రాలేదు. తగిన ప్రచారం లేక కొందరు, ఈసీ నిబంధనల మూలంగా మరి కొందరు ఆసక్తి చూపలేదు. ఈసీ ఆదేశాలను బూచీగా చూపి బీఎల్‌వోలు జిరాక్స్ ప్రతులను అడగడం, పదేపదే ఫోన్లు చేసి సంతకాలకు పిలవడం వంటి ఘటనలతో చాలా మంది అనాసక్తితో ఓటరుగా నమోదు చేసుకునేందుకు వెనుకడుగు వేసుకున్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది పట్టభద్రులు ఉంటే వేలల్లో దరఖాస్తులు రావడమే అందుకు నిదర్శనం.

## 40 వేల లోపే దరఖాస్తులు..

నిజామాబాద్–కరీంనగర్–ఆదిలాబాద్ ఎమ్మెల్సీ స్థానంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈసీ సెప్టెంబర్ 30 నుంచి అవకాశం కల్పించింది. నవంబర్ 6తో గడువు ముగియగా, తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. నిజామాబాద్ జిల్లాలో లక్షలాది మంది పట్టభద్రులుంటే 29,556 మంది మాత్రమే దరఖాస్తు చేశారు. 2019తో పోలిస్తే 4,843 మంది ఎక్కువే దరఖాస్తు చేసినప్పటికీ, ఇందులో పరిశీలన తర్వాత ఓటు హక్కు పొందేది ఎంత మంది? అన్నది తేలాల్సి ఉంది. ఇక, కామారెడ్డి జిల్లాలో 15,234 దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. బీఎల్‌వోలు పరిశీలన చేసిన అనంతరం పట్టభద్రుల ఓటరు దరఖాస్తులను ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉన్న కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కు పంపించారు. వీటికి అక్కడే ఆమోదం లభించనుంది.

## ప్రచారమే లేదు..

ఓటు నమోదులో అనేక అనుమానాలు, సందేహాలతో ఈసారి పట్టభద్రులు కొట్టుమిట్టాడినప్పటికీ ఎన్నికల అధికారులు నిజామాబాద్ జిల్లాలో ఎక్కడా నివృత్తి చేసిన దాఖలాలు కనిపించలేదు. కేంద్ర ఎన్నికల సంఘం ఈసారి అవగాహన కార్యక్రమాలు చేపట్టలేదు. ప్రచారం కూడా అంతంతే సాగింది. జిల్లా ఎన్నికల అధికారి హోదాలో ఉన్నతాధికారులు సైతం అంతగా ఆసక్తి చూపిన దాఖలాలు కనిపించలేదు. పట్టభద్రులంతా చదువుకున్న వారే అన్న ఒకే ఒక కారణాన్ని చూపి ప్రచారం చేయకపోవడంతో చాలా మందికి విషయం తెలియక దరఖాస్తు చేయలేకపోయారు.

## మొదట్లో ఇక్కట్లు పెట్టి..

ఓటరు నమోదు ప్రారంభమైన మొదట్లో ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా ఆన్‌లైన్‌లో అప్లై చేశారు. ఫార్మ్ 18 భర్తీ చేసి సర్టిఫికెట్లను అటాచ్ చేశారు. దరఖాస్తుకు ఒక నిర్దేశిత నంబర్‌ను కేటాయించి, అప్లికేషన్ స్టేటస్‌ను తెలుకునేందుకు ఈసీ వెసులుబాటు కల్పించింది. అయితే, వారం రోజులైనా బీఎల్‌వో వద్దే దరఖాస్తులు పెండింగ్‌లో చూపించడం మొదట్లో కనిపించింది. మరోవైపు, బీఎల్‌వోలు స్వయంగా దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి సంబంధిత తహసీల్ ఆఫీస్‌కు వచ్చి ఒరిజినల్ అర్హత ధ్రువీకరణ పత్రాన్ని చూపించాలని కోరడంతో పట్టభద్రులు హతాశులయ్యారు. మరోసారి ఫోన్ చేసి కనీసం జిరాక్స్ పేపర్‌ను ఇవ్వాలని కోరారు. ఇంకోసారి సంతకాలు కావాలంటూ ఫోన్లు చేయడంతో చాలా మంది తమ డ్యూటీలు వదిలి రావడానికి ఇబ్బంది పడ్డారు. ఓటుహక్కు వస్తే రానీ లేకుంటే లేదు అని చాలించుకున్నారు. రాజ్యాంగబద్ధ సంస్థ అయిన కేంద్ర ఎన్నికల సంఘం పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఎన్నికలు జరుగుతున్న సమయంలో యూనివర్సిటీలతో సమాచారాన్ని అనుసంధానం చేసుకుని ఉంటే దరఖాస్తుదారుల పరిశీలన సులువు అయ్యేది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసిన వారంతా భౌతికంగా కార్యాలయాల చుట్టూ తిరగడమన్నది ప్రస్తుత ఆధునిక కాలంలో సరైన నిబంధన కానే కాదని పట్టభద్రులు చెబుతున్నారు.

## చివర్లో ఆగమాగం..

ఓటరు నమోదుకు గడువు ముగియడంతో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగంగా చేయాలని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. దీంతో బీఎల్‌వోలు నవంబర్ 13వ తేదీ వరకు పరిశీలన చేపట్టారు. ఈసారి మాత్రం ఎవరికీ ఎలాంటి ఫోన్లు చేయకుండానే, కనీసం పరిశీలన కూడా సరిగా చేయకుండానే వచ్చిన దరఖాస్తులకు, స్థానిక ఓటర్ కార్డు(ఎపిక్ కార్డు) నంబర్‌ను పరిశీలించి ఎడాపెడా ఆమోదముద్ర వేసినట్లు తెలిసింది. ఇదేందని అడిగితే పైనుంచి ఆదేశాలంటూ సమాధానాలు చెబుతుండడం అనేక అనుమానాలు కలిగిస్తున్నది. చివర్లో ఓట్ల ఆమోదానికి బీఎల్‌వోలు పరిగణనలోకి తీసుకున్న నిబంధనలు ఏమిటి? మొదట్లో తిరస్కరిస్తామంటూ బీఎల్‌వోలు ఫోన్లు చేయడంలో ఉన్న మర్మం ఏమిటి? అంటూ చాలా మంది పట్టభద్రులు ప్రశ్నిస్తున్నారు.

# సమస్యల వలయంలో జీజీహెచ్



దవాఖానలోని ఓ వార్డులో పగిలిన టైల్స్

- పలు అంతస్తుల్లోని హాళ్లలో పగిలిన టైల్స్
- వేధిస్తున్న పరికరాలు, మందులు, వైద్యుల కొరత
- ఉపయోగించలేని విధంగా మరుగుదొడ్లు
- పేరుకే నాలుగు లిఫ్టులు.. వినియోగంలో రెండు మాత్రమే..
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు

ఖలీల్‌వాడి, నవంబర్ 15 : నిజామాబాద్ జిల్లాకేంద్రంలో ఏడంతస్తుల్లో ఉన్న ప్రభుత్వ జనరల్ దవాఖాన సమస్యల వలయంగా మారింది. బయట నుంచి చూస్తే అద్దాల మేడగా కనిపిస్తున్నా.. లోపల మాత్రం వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నది. దీంతో రోగులతోపాటు పేషెంట్లతో ఉండే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దవాఖానలో అన్ని వసతులు కల్పించడంతో పాటు కోట్ల రూపాయలతో పరికరాలు, ఖరీదైన వైద్యం, క్యాథ్‌ల్యాబ్, సిటీస్కాన్ తదితర పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చి, నిరుపేదలకు అత్యాధునిక పరికరాలతో వైద్యసేవలను సులభతరం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ప్రభుత్వ దవాఖాన పరిస్థితి అస్తవ్యస్థంగా మారింది.

నిజామాబాద్ ప్రభుత్వ దవాఖాన అంటే పెట్టింది పేరు. మహారాష్ట్ర, ఆదిలాబాద్, నిర్మల్ నుంచి రోగులు వస్తుంటారు. రోజురోజుకూ దవాఖానకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ దవాఖానలో సరైన సౌకర్యాలు సమకూర్చడం లేదు. దవాఖానలో విరిగిన బెడ్లు, పేషెంట్‌తో వచ్చిన వారు కూర్చుండేందుకు స్టూళ్లు లేకపోవడం, పలు గదుల్లో వాటర్ లీకేజీ, తాగేందుకు నీరు లేకపోవడం తదితర సమస్యలతో రోగులు, దవాఖానకు వచ్చే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## సీనియర్ డాక్టర్లు ఎక్కడ ?

నిజామాబాద్ జిల్లాలో చాలా సీనియర్ డాక్టర్లు ఉండే వారు. ఒక్క రోజులోనే 67 ఆపరేషన్లు చేసి రాష్ట్రంలో నంబర్‌వన్ దవాఖానగా నిలిచింది జీజీహెచ్. నిజామాబాద్‌లో 300 పైగా మోకాళ్ల చిప్పల మార్పిడి జరిగితే రాష్ట్ర మంతా అభినందించిన ప్రభుత్వ దవాఖానలో ప్రస్తుతం వైద్యుల కొరత ఏర్పడింది. దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 18 మంది వైద్యులను బదిలీ చేయడంతో ఒక్కసారిగా వైద్యసేవలను అందించడంలో పరిస్థితి తారుమారు అయ్యింది. కొందరు వైద్యులు రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషిచేస్తున్నా మందుల కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు.



లీకేజీతో గదిలో నిలిచిన నీరు

పగిలిన టైల్స్, వినియోగించకుండా మారిన మరుగుదొడ్డి

## సమస్యలు ఇలా..

మొదటి అంతస్తులో డెలివరీ వార్డులో కూర్చునేందుకు స్టూళ్లు, రేకులు లేవు. రెండో అంతస్తులో రోగుల బెడ్లు విరిగిపోయి ఉన్నాయి. జనరల్ వార్డులోని బాత్రూంలలో వాటర్ రావడంలేదు. బెడ్లు విరిగిపోయి ఉన్నాయి. ప్రతి వార్డులో సింకులు ఏర్పాటు చేశారు. కానీ వాటర్ సౌకర్యం మాత్రం లేదు. ఫ్లోర్ పగిలిపోయి ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. పేరుకు నాలుగు లిఫ్టులు ఉన్నా రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. వాటిని వైద్యులు మాత్రమే వినియోగిస్తున్నారు. దీంతో వివిధ రోగాలతో బాధపడుతున్న వారు పైఅంతస్తులకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందుల విషయానికి వస్తే కొన్ని మందులు అందుబాటులో లేకపోవడంతో రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పేదలు బయటకొనుగోలు చేయలేని పరిస్థితుల్లో ప్రభుత్వ దవాఖానకు వస్తే మందులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### ప్రభుత్వం దవాఖానపై దృష్టిపెట్టాలి



నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టాలి. దవాఖానలో చాలా సమస్యలు ఉన్నాయి. రోగుల బెడ్లు విరిగిపోయి ఉన్నాయి. దవాఖానకు వచ్చే అధికారులకు పగిలిన ఫ్లోర్లు కనిపించడం లేదా?. దవాఖానలో వసతులు కల్పించి, మందులు అందుబాటులో ఉంచి, రోగులకు మంచి వైద్య సేవలు అందించాలి.

**- సుజాత, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి**